

నాట్లేసిన కలెక్టర్

- రైతుగా మారిన అరుణ్‌బాబు
- కూలీలకు రూ.6 వేలు సాయం

పిడుగురాళ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అరుణ్‌బాబు రైతుగా మారాడు. మండలంలోని వీరాపురం గ్రామంలో బుధవారం అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారి పక్కనే మాగాణి భూమిలో రైతులు, కూలీలతో కలిసి కొద్దిసేపు కలెక్టర్ నాట్లు వేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన మహిళా కూలీలతో మాట్లాడారు. రోజుకు ఎన్ని ఎకరాలు నాట్లు వేస్తున్నారు.. కూలి సరిపోతుందా.. నాట్లు వేసేటప్పుడు ఏమేమి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.. అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలకు రూ.6 వేలు అందజేశారు. కూలీలు వద్దంటున్నా కుటుంబ అవసరాలకో, దుస్తులు కొనుగోలుకో ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులతో కలిసి వరినారు పీకడం, నాటు వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ వాతావరణాన్ని బట్టి పంటలను సాగుచేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అందరూ ఒకేరకమైన పంటలు సాగు చేస్తే ధర లేకపోవడం వల్ల రైతుకు నష్టం వస్తుందన్నారు. వాణిజ్య పంటల సాగుతో ప్రభుత్వ రాయితీని ఉపయోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, ప్రస్తుత పైర్లకు సరిపడ నిల్వలు ఉన్నాయన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మురళీకృష్ణ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి జగ్గారావు, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పీఏసీఎస్ చైర్మన్ వడ్డవల్లి సర్వేశ్వరరావు, తహసీల్దార్ మధుబాబు, ఇన్‌చార్జ్ వ్యవసాయ శాఖ అధికారి వేణుగోపాల్, విజయరామారావు, రావి వెంకట రమణ, సదా తదితర రైతులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో..
జన్యు పరీక్షల కేంద్రం

- ఏర్పాటుకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆమోదం
- గుంటూరులో ఇక సికిల్‌సెల్ జబ్బు స్థాయి నిర్ధారణ



గుంటూరు మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ రంగ వైద్య సేవలకు స్టేట్ రిఫరల్ ఆస్పత్రిగా రూపుదాలుస్తున్న గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి జన్యు పరీక్షల కేంద్రం మంజూరైంది. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఈ కేంద్రం నిర్మించనున్నారు. గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం 'సెంటర్ ఆఫ్ కాంపెటెన్స్' (సీఓసీ)గా ఈ కేంద్రం పని చేయనున్నది. సికిల్‌సెల్ జబ్బు స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో నిర్వహిస్తారు. దంపతుల నుంచి సేకరించిన రక్త నమూనాల ద్వారా సికిల్‌సెల్ జబ్బు ఉందా? లేదా? ఉంటే ఏ స్థాయిలో ఉంది? రాబోయే రోజుల్లో వీరి ద్వారా సంతానానికి సంక్రమిస్తుందా? లేదా? అని తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో జరుగుతాయి. శిశువుల నుంచి సేకరించిన రక్త నమూనాలను కూడా ఇక్కడ పరీక్షిస్తారు.

2047కి వ్యాధి నిర్మూలనే లక్ష్యం

గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సికిల్‌సెల్ ఎనీమియా జన్యుపరమైన రక్తసంబంధిత రుగ్మత. 2047 నాటికి దేశంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ధ్యేయంతో 'జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ మిషన్'ను కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా సిల్‌సెల్ జబ్బు ప్రబలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో పాటు మొత్తం 17 రాష్ట్రాల్లో సీఓసీలు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీలో గుంటూరు జీజీహెచ్‌తో పాటు విశాఖలోని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో సికిల్‌సెల్ జన్యు పరీక్షల కేంద్రాలకు కేంద్రం ఆమోదం తెలిపింది. కాగా గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసే జన్యు పరీక్షల కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియాతో పాటు థలసీమియా జన్యు పరీక్షలు అందుబాట్లోకి వస్తాయని వైద్యాధికారులు తెలిపారు. ఈ జన్యు పరీక్షల వైద్య పరికరాలను ఏపీ ఎంఎస్ ఐడీసీ ద్వారా టెంటర్లు పిలిచి కొనుగోలు చేయనున్నారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం



- 20 వేల స్టార్టప్‌లు.. 5 లక్షల మందికి ఉపాధి
- ఔత్సాహికులను ప్రోత్సాహించేలా మంగళగిరిలో హబ్
- జాతీయ స్థాయి ప్రాముఖ్యత లభించేలా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- నాలుగు వందల మందికిపైగా స్టార్టప్ కంపెనీల ప్రతినిధుల హాజరు
- ప్రతిపాదించిన ఏడాదిలోగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కార్యరూపం

మంగళగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలే కేంద్రంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ యువతకు ఓ ఆశాకిరణంగా మారనున్నది. ఇన్నోవేషన్ హబ్‌లు దేశంలో ఇప్పటికే కొన్ని ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ప్రారంభించిన హబ్‌కు జాతీయస్థాయి ప్రాముఖ్యత నెలకొంది. దీని ప్రారంభోత్సవానికి ఆహ్వానితులు కాకుండా దాదాపు నాలుగు వందల మందికిపైగా కొత్త స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. వీరు స్టార్టప్‌ల తాలూకు స్టాల్స్‌ను ప్రదర్శించగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత ఏడాది అక్టోబరులో తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపాదించారు. అయితే ఏడాదిలోగానే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చేలా చేశారు. వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లను ఏర్పాటుచేసి ఐదు లక్షల మందికి ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా ఈ హబ్‌లను ఏర్పాటు చేశారు. నైపుణ్యం కలిగిన ఔత్సాహికులు, మహిళలు, యువతకు ఈ హబ్‌లలో అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహిస్తారు. వినూత్నమైన ఆలోచనలు కలిగిన యువత వీటిని వినియోగించుకుని బంగారు బాటలు వేసుకునే వీలు కలుగుతుంది. ఇక మంగళగిరిలో హబ్‌ను ప్రారంభించిన తొలి రోజునే రికార్డు స్థాయి

(మిగతా 6వ పేజీలో)



సజీవంగా టాటా

గివ్ బ్యాక్ టూ సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా ఆచరించి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన ఆలోచనలు భావితరాలవారికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నాము. ఈ హబ్‌ల రూపంలో రతన్ టాటా ఆలోచనలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

\- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఎస్ఎస్ఆర్ కాదు.. ఎస్ఐఆర్

- బోగస్ ఓటర్ల ఏరివేతకు రంగం సిద్ధం
- ఇంటింటికి వెళ్లి జీవించి ఉన్న ఓటర్ల వరకే నమోదు
- లోపాలు లేకుండా 2026 ఓటరు జాబితాల రూపకల్పన



గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏటా ఆగస్టు నెల వస్తుందంటే ఓటర్ జాబితాలకు సంబంధించి స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) ప్రారంభమయ్యేది. దాదాపుగా నాలుగైదు నెలల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహణ, ఓటర్ జాబితాల స్వచ్ఛీకరణ అనంతరం తదుపరి జనవరి మొదటి వారంలో తుది ఓటర్ల జాబితాని ఎన్నికల సంఘం ఆమోదంతో జిల్లా యంత్రాంగాలు ప్రకటించేవి. అయితే ఈ దఫా ఆగస్టు నెల చివరి వారం సమీపిస్తున్నా ఎస్ఎస్ఆర్ ఊసే లేదు. ఇందుకు కారణం బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేపట్టిన ఈసీ దాదాపుగా 65 లక్షల బోగస్ ఓటర్లను తొలగించడమే. అదే విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపుదిద్దుకుంటున్నాయని, అందుకే ఓటర్ల జాబితాల సవరణ షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఓటర్ జాబితాల సవరణ కార్యక్రమం మరి కొద్ది రోజుల్లోనే పెద్దఎత్తున జిల్లాల్లో జరగనున్నది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల పేర్లన్నింటిని డేటా బేస్ నుంచి తొలగిస్తారని రెవెన్యూ అధికారులు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్ల పేర్లను నమోదు చేస్తారు. దాంతో చనిపోయిన, డూప్లికేట్, బోగస్ ఓటర్ల ఏరివేత జరుగుతుంది. రాజకీయ పార్టీలు వేలు పెట్టి చూపడానికి చిన్న కారణం కూడా లేకుండా 2026 ఓటర్ జాబితాలు రూపుదిద్దుకుంటాయని తెలిపారు. ఆ ఓటర్ జాబితాల్లో పేరు, తండ్రి పేరు, ఫొటో, చిరునామా వంటి అన్ని వివరాలు కచ్చితత్వంతో కూడుకుని ఉంటాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఎట్టలేదన్నా నాలుగు నెలలకు పైగా కసరత్తు జరుగుతుం దన్న అభిప్రా యాన్ని వ్యక్తపరుస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రామాణికం

వచ్చే ఏడాది మార్చిలో స్థానిక సంస్థల పదవీకాలం ముగుస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా పరిష త్తులు, మండల పరిషత్తులకు ఎన్నికలు జరిపించాల్సి ఉంటుంది. ఎన్నికలు సకాలంలో జరిగి పాలకవర్గాలు ఏర్పడితేనే కేంద్రం నుంచి నిధులు విడుదలౌతాయి. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా ఎన్ని కలు జరుపుతుందన్న అభిప్రాయం అటు అధికార, ఇటు రాజకీయ వర్గాల్లో నెలకొని ఉన్నది. ఈ నేపథ్యంలో సమూలంగా ప్రక్షాళన చేసిన ఓటర్ జాబితాలు ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చేసేందుకు ఉపయోగపడతాయి.



నరసరావుపేటలో నిలిచిన గృహాలు

గృహయోగం జాప్యం

- అదనపు సాయం అందిస్తున్నా స్పందన కరువు
- ఏడు నెలల్లో 2,225 గృహాలు మాత్రమే నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదల గృహ నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం అదనపు సాయం అందిస్తున్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు స్పందించడంలేదు. పేదలను చైతన్య పరిచి వారు ఇంటిని నిర్మించుకునేందుకు అధికారులు తీసుకుం టున్న చర్యలు శూన్యంగా ఉన్నాయి. జిల్లాలో ఏడు నెలల్లో గృహనిర్మాణ శాఖ పరిధిలో 2,225 గృహాలను మాత్రమే నిర్మించారు. ఇక టిడ్కో ఇళ్ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది. ఏడాదిలో ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదని ఆ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ బీఎల్‌సీ పథకం కింద జిల్లాలో 44,737 గృహాలను రూ.805.27 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఈ పథకం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా నేటికి 17,585 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. టిడ్కో పథకం కింద జీ+3 విధానంలో 12,512 గృహాలు మంజూ రు కాగా నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపాల్టీల్లో 6016 గృహాల నిర్మాణం పూర్తి చేశారు. వీటిని కూడా పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అప్పగించలేదు. నరసరావుపేటలో అన్ని వసతులు కల్పించినా లబ్ధిదారులకు గృహాలను అప్పగించకుండా పాడు పెట్టడం గమనార్హం. ఏడేళ్ల క్రితం రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదా రులు సొంత ఇంటి కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇంటిని పొందకుండానే బ్యాంకులో తీసుకున్న రుణాలకు లబ్ధిదారులు ఈఎంఐలు చెల్లిస్తున్నారు. ఇంటిని ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నా వారి మొర ఆలకించే వారే కరువయ్యారు. ఇక జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడంలేదు. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణాలు పునాదుల స్థాయి దాటలేదు. కూటమి ప్రభుత్వం ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు ప్రభుత్వ అదనపు సాయం అందజేస్తున్నా ఆయా వర్గాల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణంలో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది.



టిడ్కో గృహాల వద్ద పెరిగిన కంప చెట్లు

ఘరానా మోసగాడి అరెస్టు

ఉద్యోగాలు.. బీమా పేరిట వంచన

యడ్లపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై ఉద్యోగాలు ఇప్పిసానంటూ.. మృతులకు బీమా సొమ్ము వచ్చిందని వారి కుటుంబీకులను నమ్మిస్తూ ప్రజలను వంచిస్తున్న ఘరానా మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల యడ్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందగా జీవిత బీమా సొమ్ములు వచ్చిందని బంధువులను మోసం చేసిన కేసులో గుంటూరు రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన చుక్కా బాబు అనే యువకుడ్ని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ సుబ్బనాయుడు తెలిపారు. ఇతడ్ని యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకర్ల ఎదుట ప్రవేశపెట్టిన సీఐ మోసగాడి వివరాలు తెలిపారు. పసికర్లతో యడ్లపాడుకి చెందిన బండి ఆంజనేయులు(38) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెల 22న మృతి చెందాడు. ఈ క్రమంలో ఆంజనేయులు బంధువులను ఈ నెల 14న కలసి తాను ఎయిమ్స్ నుంచి వస్తున్నట్లు చుక్కా బాబు పరిచయం చేసుకున్నాడు. ఆంజనేయులుకు ఇన్సూరెన్స్ కింద రూ.7.50 లక్షలు వస్తాయని నమ్మించి బ్యాంకు ఖాతా, బీమా కార్డుతో పాటు ఖర్చుల కింద రూ.28 వేలు ఫోన్‌పే ద్వారా వసూలు చేశాడు. అనంతరం పలుమార్లు బాధితులు ఫోన్ చేసినా బాబు నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయామని గ్రహించిన ఆంజనేయులు బంధువులు యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ శివరామకృష్ణ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడ్ని గుంటూరులో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అతడి నుంచి స్కూటీని, ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పలు కేసుల్లో బాబు నిందితుడని సీఐ తెలిపారు. బాలికపై ఆఘాయిత్యానికి పాల్పడిన కేసులో గుంటూరు అర్బన్ దిశ పోలీస్‌స్టేషన్‌లో, కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ నిరుద్యోగి నుంచి రూ.59 లక్షలు తీసుకుని మోసగించినందుకు మంగళగిరిలోను ఇతడిపై కేసులు ఉన్నాయన్నారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ సుబ్బనాయుడు



రేకుల షెడ్డులో కొనసాగుతున్న వసతి గృహం

రేకుల షెడ్లలో వసతి

- విలవిలలాడుతున్న విద్యార్థులు
- అద్దెకు తీసుకున్న ఇరుకు షెడ్లలో అవస్థలు

వినుకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రేకుల షెడ్లు.. అవీ ఇరుకుగానే ఉన్నాయి. అద్దెకు తీసుకున్న రేకుల షెడ్లలో సంక్షేమ అధికారులు విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. చాలీచాలని ఇరుకు గదుల్లో కనీస సౌకర్యాలు లేక ఉక్కపోతతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా అధికారులకు పట్టడం లేదు. ఈ పరిస్థితి వినుకొండలోని ఎస్సీ బాలుర వసతిగృహ విద్యార్థులది. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని వసతిగృహం శిథిలావస్థకు చేరుకోగా వెన్నపూస కాలనీలో రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని విద్యార్థులకు వసతి కల్పించారు. సుమారు వందమందికి పైగా విద్యార్థులు ఉన్న హాస్టల్ గోడౌన్‌కు ఉపయోగించే రేకులు షెడ్లలో నిర్వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన వసతులు లేక నిత్యం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా అధికారులకు పట్టడం లేదు.

అద్దె భవనాల్లో అవస్థలు..

వినుకొండలోని బీసీ బాలుర హాస్టల్ నరసరావుపేట రోడ్డులోని శ్రీనివాస్‌నగర్‌లో ఓ అద్దె భవనంలో కొనసాగుతుంది. ఈ హాస్టల్లో ఇంటర్మీడియట్, ఐటీఐ కళాశాల విద్యార్థులు 40 మందికి పైగా ఉంటున్నారు. అయితే ఈ అద్దె భవనంలో వసతులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కారంపూడి రోడ్డులోని హీరో హోండా షోరూం వెనుక భాగంలోని ఓ అద్దె రేకుల షెడ్లలో బీసీ బాలికల కాలేజీ హాస్టల్ కొనసాగుతుంది. సుమారు 60 మంది విద్యార్థినులు ఇక్కడ వసతి పొందుతున్నా సరైన సౌకర్యాలు లేవు. 2011లో ప్రారంభమైన కళాశాల హాస్టల్ నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతుంది. ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించకపోవడం కళాశాల విద్యార్థినీ విద్యార్థుల పట్ల శాపంగా మారింది. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకునే విద్యార్థులకు వసతులు లేక చదువులు మానుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



నూతన భవనాలు నిర్మించాలి



15 సంవత్సరాలుగా సంక్షేమ కళాశాల హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వసతులు లేని భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారు. చాలామంది విద్యార్థులు వసతులు లేక చదువు మానుకుంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన నూతనంగా వసతి భవనాలు ప్రభుత్వం నిర్మించాలి. **- మహంకాళి సుబ్బారావు, విద్యార్థి సంఘ నేత**

రోడ్లను త్వరగా పూర్తి చేయాలి

కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి ఎంపీ లావు వినతి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు పరిధిలోని ప్రధాన జాతీయ రహదారుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో గడ్కరీని బుధవారం కలసి వినతి పత్రం అందజేశారు. కొండమోడు - పేరేచర్ల వరకు నాలుగు వరసల జాతీయ రహదారి (167 ఏజీ) నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయని, అయితే పనుల్లో పురోగతి కనిపించడం లేదని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాన్ని వేగవంతం చేసేలా చొరవ చూపాలని ఎంపీ కోరారు. చిలకలూరిపేట - నకరికల్లు జాతీయ రహదారి ప్రాజెక్టుకు లెటర్ ఆఫ్ అవార్డు ఇంకా జారీ కాలేదని మంత్రికి వివరించారు. నరసరావుపేట బైపాస్ బాధిత రైతులు మెరుగైన పరిహారం కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర స్టే వచ్చిందని, సీఏఎల్ఏ అవార్డు ఇవ్వలేకపోవడంతో ప్రాజెక్టు నిలిచిపోయిం దన్నారు. ఈ పరిస్థితుల్లో దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు తక్షణ పరిష్కారం అవసరమని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత కీలకమని, కేంద్ర మంత్రిత్వ శాఖ తక్షణ జోక్యంతో సమస్యలు పరిష్కరించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి
- 70 గేట్లు పూర్తిగా ఎత్తివేత
- దిగువకు 4,56,400 క్యూసెక్కులు
8

వైసీపీ నాయకుడు అంబటి మురళిపై పోలీసులకు ఫిర్యాదు
6

బాలిక హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ముగ్గురు ఏపీపీల తొలగింపు

గుంటూరు(లీగల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని కోర్టులలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులై పనిచేస్తున్న ముగ్గురు ఏపీపీలను ముందస్తు నోటీసుతో ఆ పదవుల నుంచి తొలగిస్తూ హోంశాఖ రాష్ట్ర కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదవ అదనపు జిల్లా కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న పల్లపు కృష్ణ ఫ్యామిలీ కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న బీ కోటేశ్వరరావు, నాలుగవ అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఏపీపీగా పని చేస్తున్న జ్యోత్స్న తొలగించిన వారిలో ఉన్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా తొలగించాలని ప్రాసిక్యూషన్ డైరెక్టర్ చేసిన సిఫార్సు మేరకు వీరిపై వేటు పడింది.

పెన్షన్‌లపై వైసీపీ దిగజారుడు రాజకీయం

● విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ స్వామి, పాల్గొన్న టీడీపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెన్షన్‌లను తొలగిస్తున్నారంటూ వైసీపీ దిగుజారుడు రాజకీయం చేస్తుందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి మండిపడ్డారు. గుంటూరులోని అరండల్‌పేట టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనర్హులకు పెన్షన్ ఇచ్చి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసిందన్నారు. అటువంటి వారిని గుర్తించేందుకే సదరం పత్రాల పరిశీలన చేపట్టామన్నారు. అర్హులకు పెన్షన్ తొలగించే ప్రసక్తే లేదన్నారు. అనర్హుల పింఛన్ మాత్రమే సెప్టెంబరు నుంచి నిలుపుదల చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగులకు పెన్షన్ పెంచామని గుర్తు చేసుకున్నారు. త్వరలోనే నూరు శాతం రాయితీతో త్రిచక్ర వాహనాన్ని అందజేస్తామన్నారు. గత ఐదేళ్లలో దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన చేయని వైసీపీ ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, మర్రిపాటి శ్రీనివాస్, మైనేని లక్ష్మీనారాయణ, కొల్లి అనీల్, వెలుగు శివప్రసాద్, సాయి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన విరమించిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి

తెనాలి అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గత పది రోజులుగా ఆందోళన చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి పద్మావతి బుధవారం విరమించారు. వినియోగదారుల సేవా కేంద్రాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసనగా సాలిపేటలోని టెలిఫోన్ ఎక్ఛేంజ్ వద్ద ఆమె ఆందోళన చేపట్టారు. స్థానిక అధికారులు నచ్చజెప్పినప్పటికీ ఆందోళన విరమించకపోవడంతో ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బీఎస్ఎన్ఎల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, పున్నారావు ఆమెకు నచ్చజెప్పారు. జోనల్ మేనేజర్‌తో మాట్లాడించి ప్రైవేటీకరణ అంశం విధానపరమైన నిర్ణయం కాబట్టి ఆందోళన విరమించాలన్నారు. దీంతో ఆమె ఆందోళన విరమించారు.

క్రీడారంగాన్ని అగ్రస్థానంలో నిలబెడతాం

క్రీడాపోటీలను ప్రారంభించిన శాప్ చైర్మన్ రవినాయుడు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

పెదకాకాని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఈనెల 29న విశాఖపట్టణం వేదికగా నేషనల్ స్పోర్ట్స్ డేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం ప్రారంభించారు. నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి 2వేల మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. తొలుత ఇండోర్ స్టేడియంలోని బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ కోర్టులను సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. దానిలో భాగంగానే జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు ఈనెల 29న నిర్వహించే స్పోర్ట్స్ డే వేడుకలో సీఎం చంద్రబాబు చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామన్నారు. 2029లో ఏపీలో జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు ఎ.రమణారావు, ఎస్.సంతోష్ కుమార్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పాల్ కుమార్, డీఎస్డీవోలు నరసింహారెడ్డి, అజీజ్, ఝాన్సీలక్ష్మి, బి. రాజరాజేశ్వరి, యతిరాజ్, పాల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వరదల పేరుతో వికృత రాజకీయాలు చేస్తే సహించం

● ఎమ్మెల్యేలు నరేంద్ర, శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అమరావతితో పాటు ఇతర ప్రాంతాలు వరదలతో పూర్తిగా మునిగిపోయాయంటూ అంబటి సోదరులు చేస్తున్న వికృత రాజకీయాలను ఇకపై సహించమని పొన్నూరు, తాడికొండ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో జగన్ మోహనరెడ్డికి, అంబటి సోదరులకు ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదన్నారు. నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అంబటి రాంబాబు చేసిన అవినీతి కారణంగానే నేడు ఇటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం ఒక్క సాగు కాలువకు మరమ్మత్తులు చేయలేదన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 320 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసిందని, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటాలు తేలక ఆ ప్రాజెక్టును నిలిపివేశారని ఆరోపించారు. దీంతో గుంటూరు చానల్‌కు గండ్లు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మీ ధన దాహానికి నేడు పంటలు నీట మునిగిపోయాయని, ఇప్పుడు ఏమి తెలియనట్టు అంబటి సోదరులు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. గత పొన్నూరు ఎమ్మెల్యే వెంచర్ వేసి, చెరువు మధ్య నుంచి రహదారి ఏర్పాటు చేయడం వల్లే నంబూరులో ఇళ్ల మధ్య వరద నీరు చేరిందన్నారు. వైసీపీ నాయకుల అక్రమాలను ప్రశ్నించామనే మాపై ఎస్సీ, ఎస్టీతో పాటు అనేక కేసులు పెట్టారని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ అమరావతిపై విషం గక్కిందుకే వరద, బురద రాజకీయాల చేస్తున్నారని మండిపడ్డారు. అంబటి మురళి అనే వ్యక్తి మోసానికి ప్రతి రూపమని, అందుకే ప్రభుత్వ స్థలంలో అపార్ట్‌మెంట్‌లను నిర్మించి అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. అంబటి సోదరులపై రాబోయే రోజుల్లో సాక్షాధారాలతో వారి బాగోతాలు సీరియల్ వారిగా బయట పెడతామని హెచ్చరించారు. కొండవీటి వాగు, పాలవాగు, చెల్లా వాగు ద్వారా వచ్చే వరద నీరు సజావుగానే వెళ్లిపోయాయని తెలిపారు. వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లను నమోదు చేసుకున్నాయి. 24 గంటల్లోనే బిజినెస్ స్టార్టప్‌ల కోసం 1,67,321 మంది రిజిస్ట్రేషన్లు జరిపించుకున్నారు.

స్టార్టప్‌లకు ఊతం

'స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా ఇన్నోవేషన్ హబ్‌లు పనిచేస్తాయి. యువతలోని వినూత్న ఆలోచనలను సరికొత్త ఆవిష్కరణల రూపంలో వెలికితీయడమే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ల లక్ష్యం.' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ తోపాటు విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలో నెలకొల్సిన అనుబంధ కేంద్రాలను ఆయన బుధవారం టాటా గ్రూప్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఓ ఇన్నోవేషన్ హబ్ ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌కు విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తన నినాదమన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓ వైపు సంపదను సృష్టిస్తూనే మరోవైపు పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పేదల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరుస్తూ వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గ్రామస్థాయి నుంచి ఆవిష్కరణలు

గ్రామాల నుంచి గ్లోబల్ స్థాయి వరకు అన్ని రంగాల్లో ఆవిష్కరణలు రావాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలను చేయగలిగితే యావత్ ప్రపంచమంతా వాటిని ఆదరించి తీరుతుందన్నారు. ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న తమ సంకల్పంలో ఇదో తొలిమెట్టని తెలిపారు. ఈ కార్యాలయ భవనం లక్షలాది యువతకొక ఆశాకిరణన్నారు. అమరావతిని హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే బాబు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టాటా గ్రూప్స్ చైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్డ్ చైర్మన్ బాబాకల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్, ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

గుంటూరు విద్య, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యనమదలలో గల కిట్స్ అక్షర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బా రావు, సెక్రటరి కోయ శేఖర్ మాట్లాడుతూ యాజమాన్యంపై నమ్మకంతో మా కళాశాలను ఎంచుకున్న తల్లి తండ్రులు, విద్యార్థులకి అభినందనలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇంజనీరింగ్ సిలబస్‌తో పాటు ఇన్నోవేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్, కోడింగ్, సాఫ్ట్‌స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామ కోటయ్య, డాక్టర్ జీ గురు కేశవదాసు, డాక్టర్ ఎస్‌కే కమరుద్దీన్, డాక్టర్ ఆర్ బుల్లిబాబు, డాక్టర్ కే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆర్ చినవెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాల కోసం ఈ నెల 26 లోగా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గుంటూరు, తెనాలి ప్రభుత్వ ఐటీఐలలో ఇందుకోసం నమోదు కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచామని తగిన సర్టిఫికెట్లతో పేరు నమోదు చేసి వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. 29న ప్రభుత్వ ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, 30వ తేదీన ప్రైవేట్ ఐటీఐలలో కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

'ఇన్నోవేషన్ హబ్'ను తిలకించిన ఆర్‌వీఆర్ విద్యార్థులు



హాజరైన విద్యార్థులు

గుంటూరు (విద్య) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవ ప్రసార కార్యక్రమాన్ని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం తిలకించారు. కళాశాలలో ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని తిలకించాలని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ వెల్లడించారు. ప్రపంచ దేశాలను ఆకర్షించేలా, ఏపీని "ఇన్నోవేషన్ హబ్"గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేబడుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కే రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

● పోస్టల్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాథిక్



నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ శాఖ నిర్వహించే దీన్‌దయాల్ స్పర్శ్ యోజన ద్వారా నిర్వహించే ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల ఎంపికకు పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాధిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల పేర్లతో పాఠశాలల నుంచి పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ చిరునామాకు సెప్టెంబరు 16వ తేదీ లోపు పంపాలన్నారు. 30న వ్రాత పరీక్ష జరుగుతుందని, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి పెలాటలీ ప్రాజెక్టు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నెలకు రూ 500 చొప్పున ఏడాదికి రూ 6 వేలు ఉపకార వేతనాల రూపంలో అందజేస్తామన్నారు. విద్యార్థులు మంచి అకాడమిక్ రికార్డ్ కలిగి, ఫిలాటలీని హాబీగా చేస్తూ, పోస్టల్ సర్కిల్ ద్వారా నిర్వహించబడే ఫిలాటలీ క్విజ్, ఫిలాటలీ ప్రాజెక్టుల ఆధారంగా స్కాలర్‌షిప్ పొందవచ్చు అన్నారు. ఎంపికప్రక్రియ రెండు దశలలో ఉంటుందన్నారు. లెవెల్-1 ఫిలాటలీ క్విజ్ పోస్టల్ అథారిటీల ద్వారా ఫిలాటలీ క్విజ్ నిర్వహించ బడుతుం దన్నారు. ఇది రెండవ స్థాయికి స్క్రీనింగ్ పరీక్షగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ ఇండియాపోస్ట్ డాట్ జీవోవీ డాట్ ఇన్‌లో సంప్రదించాలన్నారు.

48,853 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,853 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,212 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13300
273	---	----
341	10000	14600
4884	----	----
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	----	----
బ్యాడిగి 355	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	9800	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13400
నెంబరు. 5	10000	13500
273	----	----
341	11000	15000
4884	10000	12800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14400
బ్యాడిగి 355	10000	13000
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	----	---
తాలుకాయలు	5000	7300

బాలిక హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో బాలిక హత్య కేసులో నిందితుడు నరమామిడి నాగరాజుకు గుంటూరు నాలుగవ అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు యావజ్జీవ శిక్ష, రూ. 1100 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు విలువరించింది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం 2024 జూలై 15వ తేదీన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో బాలిక (13) కిడ్నాప్, హత్య కేసు నమోదయింది. ఈ కేసులో అనుమానితుడిగా కొత్త రెడ్డిపాలెంలో నివాసం ఉంటున్న కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన నరమామిడి నాగరాజును పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో డీఎస్పీ బీ జనార్ధన్ రావు సహకారంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నాగరాజు బాలిక తల్లి ఎస్తేర్ రాణితో అక్రమ సంబంధం పెట్టుకొని ఆ సంబంధం బెడిసి కొట్టిన నేపథ్యంలో ప్రతీకార భావంతో బాలికను హత్య చేసినట్లు పోలీసులు సాక్షాధారాలతో సహా గుర్తించారు. ఎట్టకేలకు నిందితుడిని రూరల్ సీఐ కోటేశ్వరరావు చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ అరెస్టు చేసి గుంటూరు నాలుగవ అదనపు జూనియర్ జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు ముందు హాజరు పరిచారు. ఈ కేసుపై త్వరితగతిన విచారణ చేపట్టిన అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు, స్పెషల్ పీపీ షేక్ ముబీనా బేగ్, కోర్టు కేసుల పర్యవేక్షణ అధికారి సీఐ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ శేష్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ నిర్మల జ్యోతి విచారణ అధికారులుగా వ్యవహరించారు. నిందితుడికి యావజ్జీవ కఠిన గారాగార శిక్ష పడేలా సాక్షాదారాలు సేకరించిన పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణను ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

అతివేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● వ్యక్తి మృతి... మరో నలుగురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన దొడ్డా శ్రీను

దాచేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అతి వేగంగా ప్రయాణం చేస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కగా నిలిపి ఉన్న ఆటోను కూడా ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం పై ప్రయాణం చేస్తున్న దొడ్డా శ్రీను(30) తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న కారు దాచేపల్లి నుంచి స్వగ్రామం గామాలపాడుకి వెళుతున్న దొడ్డా శ్రీను, అతని సోదరుడు దొడ్డా సైదులుల ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. వాహనాన్ని నడుపుతున్న సైదులు ఎగిరి రోడ్డు పై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలై తీవ్ర రక్త స్రావం జరిగింది. స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం పిడుగురాళ్ళ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనం పై వెనుక వైపు ఉన్న మృతుడి సోదరుడు సైదులకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు రోడ్డు పక్కనే ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న డ్రైవర్ తోటకూర రాధాకృష్ణ, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దాచేపల్లి పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనుకు భార్య సంధ్య, సంవత్సరం, మూడు సంవత్సరాల వయస్సు కలిగిన కుమార్తెలు ఉన్నారు. మృతుడు దొడ్డా శ్రీను మరణ వార్త తెలుసుకున్న టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, జడ్పీటీసీ జంగా కోటయ్య, సర్పంచ్ సురేష్ సంతాపాన్ని తెలిపారు.

వైసీపీ నాయకుడు అంబటి మురళిపై పోలీసులకు ఫిర్యాదు

పెదకాకాని, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గ వైసీపీ నాయకుడు అంబటి మురళి పై చర్యలు తీసుకోవాలని పెదకాకాని పోలీసులకు మండల రైతులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.... అమరావతి కోసం పొన్నూరు నియోజకవర్గంలో 72,000 ఎకరాల పంట పొలాలను ముంచేశారని, కొండవీటి వాగు వరదలు మళ్ళించి పొన్నూరులో రైతుల పంట పొలాలు ముంచి తీవ్ర నష్టం చేకూర్చారని వైసీపీ నాయకులు అంబటి మురళీకృష్ణ చేసినవి నిరాధారమైన అసత్య ఆరోపణలు అని తెలిపారు. దీని వల్లన మా ప్రాంత రైతుల ప్రతిష్టకు మచ్చ తెచ్చే విధంగా ఉన్నదని అన్నారు. ఇలాంటి ఆరోపణలు చేసిన అంబటి మురళీకృష్ణ పై కఠిన చర్యలు తీసుకోవాలని పెదకాకాని మండల రైతులు, టీడీపీ పెదకాకాని మండల నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం పెదకాకాని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత సోమవారం గ్రీవెన్స్‌లో వైసీపీ మండల నాయకులు అసత్యమైన ఫిర్యాదు చేశారని ఆరోపించారు.

స్కూల్ బస్సు ఢీకొని యువకుడి మృతి

మాచర్లటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న స్కూల్ బస్సు ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన సంఘటన వెల్దుర్తి మండలం మండాది గ్రామ సమీపంలోని కానాగు బ్రిడ్జిపై బుధవారం చోటుచేసుకుంది. వెల్దుర్తి మండలం రచ్చమలపాడుకు చెందిన ఆవుల వెంకటేశ్వర్లు (26) ద్విచక్ర వాహనంపై మాచర్ల పట్టణానికి వస్తున్నాడు. మాచర్ల పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అతివేగంగా వస్తూ మండాది సమీపంలోని కానాగు వద్ద వెంకటేశ్వర్లును ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లు బ్రిడ్జిపై నుంచి 25 అడుగుల కిందకు పడిపోవడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెల్దుర్తి పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్ లైసెన్సుల రెన్యువల్‌కు ప్రత్యేక మేళాలు

గుంటూరు మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్స్ కోసం ఆయుష్ శాఖ తొలిసారిగా ప్రత్యేక మేళాలను రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాల్లో ఆయుష్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయక సిబ్బంది హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటి, రెండు తేదీల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఓల్డ్ రిమ్స్ హాస్పిటల్, గవర్నమెంట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, ప్రకాశం భవన్ ఎదురుగా, ఒంగోలు చిరునామాకు హాజరుకావాలని ఆయుష్ శాఖ డైరెక్టర్ కోరారు. లైసెన్స్‌లు రెన్యువల్ చేయడంతో పాటు వారివారి సమస్యల పరిష్కారం కోసం ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

రైతులకు మెరుగైన సేవలు అందించాలి


పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న భాష్యం జగదీష్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నరుకుళ్లపాడు పీఏసీఎస్ పరిధిలోని రైతులకు సంఘం ద్వారా మెరుగైన సేవలు అందించాలని సీఈఓ వెంకటేశ్వరరావును చైర్‌పర్సన్ భాష్యం జగదీష్ ఆదేశించారు. బుధవారం పీఏసీఎస్ పరిధిలోని పెట్రోల్ బంకు, కోల్డ్ స్టోరేజీ, కల్యాణమండపం, గోడౌన్స్‌ను సీఈఓతో కలసి జగదీష్ పరిశీలించారు. కోల్డ్ స్టోరేజీ పూర్తిచేసి రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. రైతులకు సేవాభావంతో వాటిని నిర్వహించాలన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కేవీ సుబ్బారావు

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అండ

● చైర్‌పర్సన్ సుబ్బారావు

పిడుగురాళ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం జరిగింది. చైర్‌పర్సన్ కొత్త సుబ్బారావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు ట్రావెలింగ్ అలవెన్స్ కింద సంవత్సరానికి రూ.6వేలు కాక ప్రతినెల రూ.6వేల పింఛన్, వారికి కావలసిన ఉపకరణాలను ఉచితంగా అందిస్తుందన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పింఛన్లు రాని దివ్యాంగులు వుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, పిల్లి చెన్నారావు, ఖాశింసైదా, జమ్మిశెట్టి రామకృష్ణ, జిల్లా ఐఈడీ కో-ఆర్డినేటర్ ఆర్ చలవరాజు, భవిత రీసోర్స్‌పర్సన్లు అజిత్‌కుమార్, హరికుమార్‌లు పాల్గొన్నారు. సుమారు 260 మంది దివ్యాంగులు హాజరయ్యారు.

సంక్షిప్తం...

● సత్తెనపల్లి: పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో గల వినాయకస్వామి ఆలయం ఆధునీకరణ పనులు పూర్తిచేసిన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

● నకరికల్లు: రైతులు వరిసాగులో వ్యవసాయ అధికారులు సూచించిన మేరకే రసాయన ఎరువులు వాడాలని ఏవో దేవదాసు కోరారు. చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయనమాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అబ్దుల్లా, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్ రాజశేఖరరెడ్డి, విజయ నరసింహా, మంజుల పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలో 300 ముస్లిం కుటుంబాలు ఉంటున్నాయని, మసీదు వద్ద అంత్యక్రియల సమయంలో గదులు లేక ఇబ్బందుల పడుతున్నామని కన్నా ఆర్మీ గౌస్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే కన్నా మునిసిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి మసీదు వద్ద రెండు గదులు నిర్మించాలని సూచించారు.

● అచ్చంపేట: మండలంలో పింఛన్ పొందుతున్న 43మంది దివ్యాంగులకు నోటీసులు పంపినట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమేష్‌బాబు బుధవారం తెలిపారు. వీరిలో అర్హులైన వారుంటే అప్పీలు చేసుకోవాలని తెలిపారు.

● క్రోసూరు: తహసీల్దార్ వేముల వెంకటనాగరాజును బుధవారం రెవెన్యూ కార్యాలయంలో రేషన్‌డీలర్లు సత్కరించారు. ఆగస్టు 15న పురస్కారం అందుకున్న సందర్భంగా వారు నాగరాజుకు ఘనంగా సన్మానం చేశారు.

● పెదకూరపాడు: ఇటీవల భారీవర్షాలకు పొలాల్లో నీరు నిల్వ ఉన్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏవో కృష్ణయ్య తెలిపారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపి పంటనష్టం లేకుండా చూసుకోవాలన్నారు.

● క్రోసూరు: క్రోసూరు పీహెచ్‌సీలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహమ్మద్ షాద్ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శాంసన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● మండలంలోని దొడ్లేరులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో వేణుగోపాల్ మాట్లాడుతూ పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులందరూ ఈ క్రాప్ యాప్‌లో పంటల వివరాలు నమోదుచేసుకోవాలన్నారు.

● మండలంలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ మాపప్ కార్యక్రమాన్ని రాష్ట్రీయ బాల సాస్థా జిల్లా ప్రోగ్రాం అధికారి రాజేశ్వరి పరిశీలించారు. ఈనెల 12వ తేదీన మాత్రలు వేసుకోని పిల్లలకు బుధవారం ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీచేశారు. క్రోసూరు జడ్పీ హైస్కూల్, పలు పాఠశాలల్లో కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, సూపర్‌వైజర్ కరిముల్లా ఉన్నారు.

● రెంటచింతల: నేడు రెంటచింతల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

● మాచర్లటౌన్: ఉత్తమ ప్రశంసా పురస్కారాలు అందుకున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్‌లను బుధవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది సన్మానించారు.

● రెంటచింతల: దోమలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అంకమరావు కోరారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవ ర్యాలీలో మలేరియా పర్యవేక్షకులు కోటేశ్వరరావు, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: మండలంలోని కంభంపాడు పీహెచ్‌సీలో మాచర్ల సబ్‌యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య ఆధ్వర్యాన ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణ్, సూపర్‌వైజర్ రమాదేవి, మురళీధర్, బాలయ్య, ఎంపీహెచ్‌వో నరసింహారావు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గిలోని ఎంబీఎన్‌కాలనీ ఎంపీపీ పాఠశాలను ఎంఈవో ఖాసీం తనిఖీచేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వారిస్థాయిని బట్టి విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈనెల 25వ తేదీలోపు ఎస్ఎస్‌మెంట్ బుక్స్ వ్యాల్యుయేషన్ పూర్తిచేసి మార్కులు నమోదుచేయాలన్నారు.

● గురజాలటౌన్: పట్టణంలోని నవోదయ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన బుధవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. కార్యక్రమంలో రీడ్స్ సంస్థ ప్రోగ్రా మేనేజర్ కోమలి, మౌలా బి, రమాదేవి, ఆషా, మస్తాన్‌బి, ప్రిన్సిపాల్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

● కారంపూడి: మండలంలోని గ్రామాల్లో క్లాప్ మిత్రాల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త తీసుకెళ్లేందుకు మండలానికి పుష్‌కార్ట్స్ వచ్చాయి. మండల విస్తరణాధికారి కసిన్యానాయక్ బుధవారం వీటిని స్వాధీనం చేసుకున్నారు.

● నకరికల్లు: నీట్ పీజీ 2025 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మండలంలోని చేజర్ల గ్రామానికి చెందిన బొడ్డపాటి శివశంకర్ రెడ్డి జాతీయ స్థాయిలో 3,200 ర్యాంకు సాధించాడు. ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లోను శివశంకర్‌రెడ్డి జాతీయ స్థాయిలో 629వ ర్యాంకు సాధించాడు. బెంగుళూరు మెడికల్ కళాశాలలో శివశంకర్‌రెడ్డి ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. శివశంకర్ రెడ్డిని చేజర్ల గ్రామస్తులు అభినందించారు.

● దుర్గి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

● జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు


మాట్లాడుతున్న డీఏవో జగ్గారావు తదితరులు

పిడుగురాళ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో సాగులో వున్న వరి, పత్తి, మిరప పంటలకు సరిపడ ఎరువులు అందుబాటులో వున్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జగ్గారావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్‌కు 35వేల టన్నుల ఎరువులు అవసరంవుండగా, ఇప్పటికే 17వేల టన్నులు అందుబాటులో వున్నాయని, ఆగస్టు చివరినాటికి మిగిలిన 18వేల టన్నులు అందుబాటులోకి రానున్నాయన్నారు. మరో రెండు రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు ఎరువులు అందుబాటులోకి రానున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా ఎప్పుడు అనే ఆంధ్రజ్యోతి కథనంపై వ్యాపారులు, అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నట్లు జగ్గారావు తెలిపారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాలలో ఇప్పటికీ ఎరువుల కొరత లేదని, జోన్-2 పరిధిలో వున్న నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండకు మరో వారంలో ఎరువులు అందుబాటులోకి పూర్తిస్థాయిలో వస్తాయన్నారు. కారంపూడి మండలంలో ఎన్నికల కోడ్ వుండటం వల్ల అన్నదాత సుఖీభవ నిధులు జమకాలేదని, వారికి త్వరలో జమవుతాయన్నారు. సుఖీభవ పథకానికి నిధులు జమకానివారు సచివాలయాల్లో మరలా దరఖాస్తు చేసుకోవాలని డీఏవో తెలిపారు. ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరస్వామి, పీఏసీఎస్ చైర్మన్ వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఏవో వేణుగోపాల్, తదితరులున్నారు.

గొడవలకు దిగితే కేసులు

● డీఎస్పీ హనుమంతరావు


నకరికల్లు: మాట్లాడుతున్న డీఎస్పీ ఎం హనుమంతరావు

నకరికల్లు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించినా, గొడవలకు దిగినా కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ఎం హనుమంతరావు హెచ్చరికలు జారీ చేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమన్నారు. బుధవారం రాత్రి నకరికల్లు మండలం కుంకలగుంటలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. విగ్రహ కమిటీలదే పూర్తి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పీ కిరణ్, ఎస్ఐ చల్లా సురేష్ పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

గురజాలటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని డీఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చోట మండపాలు ఏర్పాటుచేయవద్దన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాలన్నారు. నిర్వాహకులదే పూర్తి బాధ్యతన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

● పిడుగురాళ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని పట్టణ సీఐ వెంకట్రావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండపాలకు అనుమతులు తీసుకున్నవారు సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్దిష్ట గడువులోగా విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు శివనాగరాజు, మోహన్‌లు వున్నారు.

● సత్తెనపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక ప్రతిమలు ఏర్పాటుచేసే ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుచేసే వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలన్నారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల కుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతు సేవాకేంద్రం సిబ్బందికి సత్తెనపల్లిలోని వ్యవసాయ విత్తన పరిశోధన కేంద్రంలో మూడురోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో 21 క్లస్టర్లలో 2625 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. అనంతరం పలువురు వి.ఏ.ఎ, వి.హెచ్.ఏలకు మెటీరియల్ అందజేశారు. శిక్షణలో జిల్లా శిక్షకులు సైదయ్య, నందకుమార్, హనుమయ్య, మాస్టర్ ట్రైనర్ మదుబాబు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

వైసీపీ నేతల తప్పుడు ప్రచారం దుర్మార్గం

● టీడీపీ సీనియర్ నేత మల్లికార్జునరావు

మాచర్లటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై వైసీపీ నేతల తప్పుడు ప్రచారం దుర్మార్గమని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిందని వైసీపీ నేతలతో ప్రతిపక్ష నేత జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేయించడం దుర్మార్గమన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రూ. 50 వేల కోట్లతో అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించారని, పనులు ప్రారంభంలోనే ఎలా అవినీతి జరిగిందో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని అన్నారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయినప్పటికీ వైసీపీ నేతల వైఖరి మారలేదన్నారు. ప్రసాద్, మస్తాన్, బ్రహ్మం, కొండలు, బ్రహ్మం, ఆంజనేయులు, కృష్ణ, దుర్గారావు, రఫీ పాల్గొన్నారు.

25లోగా దివ్యాంగ పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

● ఎంపీపీ సునీతా సాయిశంకర్

దుర్గి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీలోగా అర్హులైన దివ్యాంగులు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్ కోరారు. బుధవారం ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అనర్హుల కు పింఛన్ అందించారన్నారు. పింఛన్‌కు అర్హత ఉన్నవారు ఆధార్, పాత సదరంతోపాటు కొత్త సదరంకార్డుతో మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పత్తి పంటను పరిశీలించిన అధికారులు

దుర్గి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తి పంటను బుధవారం ఏవో అమీర్‌రెడ్డి, ఏఐసీ (అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ) ప్రతినిధి చంద్రశేఖర్‌లు పరిశీలించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో అధిక వర్షంతో పత్తి రైతులకు భారీనష్టం శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. పత్తి వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఉందని, ఎకరానికి రూ.1200 చెల్లించి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయిన తరువాత బీమా నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎం హర్ష బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతను హాస్టల్ ఫీజు బకాయి రూ 25వేలు ఉన్న విషయం తెలుసుకున్న డీఎస్పీ హనుమంతరావు బుధవారం అతన్ని పిలిపించి రూ 25వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.కార్యక్రమంలో న్యాయవాదులు భగ్గి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ వరం


అనీల్‌కుమార్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

నకరికల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ వరమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కుంకలగుంటకి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త దామా అనీల్ కుమార్ అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఎమ్మెల్యే చొరవతో సీఎంఆర్ఎఫ్ నుంచి అందిన రూ 4లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే కన్నా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి, అనీల్‌కుమార్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లి హరిప్రసాదు, వట్టికుంట అప్పారావు, జాష్టి శివ పాల్గొన్నారు.

వాసు మృతి తీరని లోటు

రాజుపాలెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చిన్న వయసులో రాజకీయాలలోకి వచ్చి చురుకుగా ఉంటున్న సమయంలో మృతి చెందడం పార్టీకి, తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని నెమలిపురి గ్రామంలో గుత్తా వాసు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, గంగవరపు రామలక్ష్మణ రావు తదితరులున్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



పారిశుధ్యపనులు పరిశీలిస్తున్న డీపీవో నాగేశ్వరనాయక్

కారంపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని చినకొదమగుండ్ల పంచాయతీని ఆయన సందర్శించారు. అనంతరం తడి, పొడిచెత్త కేంద్రాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కసిన్యానాయక్, పీఎస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బ్యాగుల పంపిణీ

పిడుగురాళ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కార్పొరేషన్ ద్వారా మార్కెట్‌యార్డు డైరెక్టర్ దూదేకుల ఖాసింబీ, మహిళా సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న మహిళలచే కాటన్ బ్యాగులు తయారు చేయించి ముఖ్య అతిథుల ద్వారా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీనులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కుట్టు శిక్షణ కేంద్రంఏర్పాటుచేసిందన్నారు. తద్వారా ప్లాస్టిక్ రహిత పిడుగురాళ్ల పట్టణాన్ని తీర్చిదిద్దుతుందన్నారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తురకా వీరాస్వామి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దూదేకుల ఖాసీంసైదా, వడ్డవలి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, మార్కెట్ యార్డు డైరెక్టర్ రాజేశ్వరి, వెంకటరమణ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వల్లెపు రామకృష్ణ, జెమిని రామకృష్ణ, హెచ్ ఎం మల్లికార్జునరావు, అంజూసాహెబ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ సీనియర్ బాలికల జిల్లా జట్టు ఎంపిక


సాఫ్ట్ బాల్ సీనియర్ బాలికల జట్టు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమెరపూడి జడ్పీహైస్కూల్‌లో బుధవారం సాఫ్ట్‌బాల్ సీనియర్ బాలికల జిల్లా జట్టు ఎంపిక జరిగింది. 50మందికి పైగా క్రీడాకారిణిలు హాజరైనట్లు సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి పి.సామంత్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 21 తేదీ నుండి కొమెరపూడి హైస్కూల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఎంపికల్లో సాఫ్ట్‌బాల్ జిల్లా జాయిం ట్ కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ జనార్ధనరెడ్డి, పీఈటీ సైదయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

పంటల నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతుల సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ అహ్మద్ రైతులను కోరారు. బుధవారం మండలంలోని ధరణికోటలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ పాల్గొని పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కండ్లకుంటలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జన సురక్ష క్యాంపు


సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జన సురక్ష క్యాంపులో వినియోగదారులు

గుంటూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కడప రీజియన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని కండ్లకుంట బ్రాంచ్‌లో వ్యవసాయ మెగా క్రెడిట్ ఔట్రీచ్ క్యాంప్ 'లక్ష్య', ఫైనాన్షియల్ ఇంక్లూజన్ సాచురేషన్ క్యాంప్ (జనసురక్ష క్యాంప్)ను బుధవారం నిర్వహించింది. శిబిరాన్ని కడప రీజియన్ రీజినల్ హెడ్ ఈ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జనసురక్షతో పాటు ఆర్థికపరమైన పథకాలపై ప్రచారాలలో వినియోగదారుల నుండి మంచి స్పందన లభించినట్లు అధికారులు తెలిపారు. క్రెడిట్ క్యాంపెయిన్ సమయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, సీకేసీసీ రుణగ్రహీతలకు రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కండ్లకుంట బ్రాంచ్ హెడ్ అశోక్ కుమార్, చీఫ్ మేనేజర్ బీకే ప్రసాద్, ఇతర సిబ్బంది, ఏపీఎం, ఇతర సీసీఏలు ప్రచారంలో పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న పీఏసీఎస్ పాలకవర్గం, పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

అన్నదాతల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

● ఎమ్మెల్యే కన్నా

ముప్పాళ్ళ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సకాలంలో రుణాలు అందిస్తూ అన్నదాతల అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ముప్పాళ్ళ పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం చాగంటివారిపాలెంలో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలకవర్గం సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. రైతులకు రుణాలివ్వడమే కాక వాటి రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చైర్మన్‌గా జెట్టి నాగమల్లేశ్వరరావు, డైరక్టర్లుగా సాదు వెంకటశివయ్య, యర్రం అప్పిరెడ్డిల చేత సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు ప్రమాణం చేయించారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నాను ఘనంగా సన్మానించగా నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరావు, మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, శిరిగిరి గోపాళరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఫ్లెక్సీ ఏర్పాటు

మండలంలోని గోళ్ళపాడులో కూటమి నేతల ఫొటోలు లేకుండా బుధవారం ఫ్లెక్సీ ఏర్పాటు చర్చనీయాంశమైంది. ముప్పాళ్ళ పీఏసీఎస్ డైరక్టర్, జనసేన నాయకుడు సాదు వెంకటశివయ్య స్వగ్రామంలో సీఎం, కూటమి నాయకుల ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలో పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కన్నా ఫొటోతో పాటు పలువురు కాపు సంఘం నాయకుల ఫొటోలు వేశారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పలువురు కూటమి నాయకులు అసంతృప్తితో విషయం నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం చంద్రబాబునాయుడు ఫొటోను అతికించారు.


యూరియా కోసం మునగోడు పీఏసీఎస్‌లో బారులు తీరిన రైతులు

హాట్ కేక్‌లా యూరియా అమ్మకాలు

● అయినా రైతులకు యూరియా కొరతే
● లారీ వచ్చిన రెండు గంటలలోనే రైతులకు సరఫరా


యూరియాను తీసుకువెళ్తున్న రైతులు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటలకు రైతులు యూరియా, డీఏపీ వంటి ఎరువులను వినియోగించేందుకు సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. సహకార సంఘాలలో డీఏపీ అందుబాటులో ఉండగా యూరియా మాత్రం అరకొరగా అందుతుంది. దీంతో సహకార సంఘాల గోడౌన్లకు వారానికి ఒక లారీ (440 బస్తాలు) రావడం వెంటనే రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లడం 2,3 గంటలలో జరుగుతోంది. మునగోడు పీఏసీఎస్ పరిధిలో 10గ్రామాలు ఉండగా తురకవారిపాలెం, దిడుగు, అత్తలూరు, లింగాపురం గ్రామాలలోని గోడౌన్ల వద్ద ఎరువులను రైతులకు అమ్ముతున్నారు. బయట మార్కెట్ కన్నా యూరియా తక్కువ ధర ఉండటంతో సహకార సంఘాల వద్ద కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి రైతుకు 4 బస్తాలు నిర్ధేశించి యూరియా అమ్ముతున్నారు. ఇలా చేసినా ప్రతి గోడౌన్‌లో 100మంది రైతులకు మాత్రమే యూరియా అందుతుంది. రైతుల అవసరానికి సరిపడా యూరియాను పీఏసీఎస్‌ల ద్వారా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

● మొక్కలు నాటాలని సూచన


ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహిస్తున్న ఏపీవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో 22మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో అంబటి రమేషబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతుల పొలాల గట్లపై మొక్కలు పెంచాలని, పండ్ల తోటలు, రోడ్ల వెంట మొక్కలు, ఖాళీగా ప్రభుత్వ భూముల్లోను మొక్కలు పెంపకం చేపట్టాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో తెలిపారు. ఫేజ్-2 గోకులాలకు 47 ప్రతిపాదనలు వచ్చాయని ఏపీవో తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులును అక్షరాస్యులుగా మార్చేందుకు వలంటీర్లను గుర్తిస్తామన్నారు. సమావేశంలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, టీఏ జీ శ్రీనివాసరావు, బీఎఫ్‌టీ నర్రా శేషారావు, బ్రహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

అచ్చంపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకలిగుంటవారిపాలెంలో దివ్యాంగుడైన తోట నాగరాజుకు బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం ఆధ్వర్యంలో ట్రైసైకిల్‌ను ఎమ్మెల్యే సహకారంతో అందించారు. నాగరాజుకు సదరం సర్టిఫికెట్‌లో తక్కువ శాతం నమోదు కావటంతో గ్రామ సచివాలయ అధికారులు నోటీసులు ఇచ్చారు.ఎమ్మెల్యే ప్రవీణ్ స్పందించి పింఛన్ రద్దు కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాధితుడికి ట్రైసైకిల్‌ను నాయకుల ద్వారా అందించారు. గంధం కోటేశ్వరరావు, రామకృష్ణ, తిరువాయిపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.


అరవింద వారధి వద్ద కృష్ణమ్మ పరవళ్లు

- లోతట్టు ప్రాంతాల్లో పంటల మునక
- కాజ్‌వేలపై ప్రవహిస్తున్న వరద నీరు
- వరద పొంచి ఉంది.. జాగ్రత్తని హెచ్చరికలు

శాంతించిన కృష్ణమ్మ


పోతార్లంక వద్ద అరటి తోటలో చేరిన వరద నీరు


గాజుల్లంక వద్ద కంద పంటలో వరద నీరు

భట్టిప్రోలు, కొల్లూరు ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా లంక గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కృష్ణమ్మ శాంతించింది. క్రమేపి నదిలో వరద ఉధృతి బుధవారం సాయంత్రానికి కొంతమేరకు తగ్గింది. అయితే కొల్లూరు మండలం దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న పోతార్లంక చప్టాపై, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద ఉన్న చప్టాపైన వరద నీరు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు రాకపోకలను నిలిపి వేశారు. పెదల్లంక, చింతమోటు, పెసర్లంక గ్రామాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలు, కొల్లూరు మండలంలోని ఆవులవారిపాలెం, పెసర్లంక, గాజుల్లంక, పోతార్లంక, చింతల్లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వేసిన వాణిజ్య పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఇటుక బట్టీలను నీరు చుట్టుముట్టింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటితో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ తీర లోతట్టు ప్రాంతాల భూముల్లోని అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలు ముంపునకు గురయ్యాయి. మళ్లీ నదిలో వరద పెరిగే అవకాశాలు లేకపోలేదని అధికారులు చెబుతున్నారు. వినాయక చవితి వెళ్లే వరకు వరద కొనసాగుతూనే ఉంటుందని ప్రజలు ఎవరూ నదిలోకి దిగరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతన్నల్లో భయాందోళనలు

రేపల్లె: మూడురోజులుగా వరదనీరు పోటెత్తడంతో నదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలతో నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇంకో రెండు, మూడు లక్షల క్యూసెక్కుల నీరు వస్తే గ్రామాలు, పొలాలు, రొయ్యల చెరువులు మునిగిపోయే పరిస్థితి ఉందంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓలేరు, రావిఅనంతవతరం సమీపంలో ఉన్న లోతట్టుప్రాంతాల్లో నీరు చేరింది. వరద ఉధృతంగా వస్తే రొయ్యలు నీటి పాలవుతాయని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.


విద్యార్థులను బొమ్మల పేర్లను అడుగుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అంగన్‌వాడీ, పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

దాచేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం రామ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్ కేంద్రాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కొద్దిసేపు ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పలు బొమ్మలు చూపుతూ ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం రామ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన మెనూను, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను, గదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈవో చంద్రకళ, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో వీరయ్య, డీటీ బ్రహ్మయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, శ్రీలక్ష్మి, కార్యకర్త విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

చేనేత, హస్తకళలను ప్రోత్సహించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ఏపీ హస్తకళల అభివృద్ధి ఛైర్‌పర్సన్ చేరెడ్డి మంజులా రెడ్డి అన్నారు. ఇన్నర్ రింగు రోడ్డులోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేనేత ఎక్స్‌పోను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 60 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా కళాకారుల నుంచి కొనుగోలు చేసేందుకు ఈ ప్రదర్శన నిర్వహిస్తునట్టు చెప్పారు. ఈ ప్రదర్శన సెప్టెంబరు 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ జనాబ్ షేక్ హసన్ భాషా, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు, జిల్లా టూరిజం అధికారి శ్రీ రమ్య, స్థానిక కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మిత పద్మజ తదితరులు పాల్గొన్నారు.



చేనేత ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న చేరెడ్డి మంజులా రెడ్డి

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

- 70 గేట్లు పూర్తిగా ఎత్తివేత
- దిగువకు 4,56,400 క్యూసెక్కులు
- డెల్టా కాలువలకు 10,641 క్యూసెక్కులు
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక




తాడేపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుండి బుధవారం రాత్రి వరకు 4లక్షల 67వేల 41 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 56 వేల 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 7 వేల 135 క్యూసె క్కులు, పశ్చిమ డెల్టాకు 3 వేల 506 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు ఛానల్‌కు నీటి విడుదల నిలిపివేసినట్టు జేఈ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నందున దిగువ నదీ తీర ప్రాంత వాసులు లంక భూముల రైతులు మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

టెయిల్‌పాండ్‌కు 4,47,664 క్యూసెక్కులు..

రెంటచింతల,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 10 గేట్లను 5 మీటర్లు,9 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువన వున్న పులిచింతలకు 4,51,863 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ,ఈఈ నాగరాజులు చెప్పారు.బుధవారం సాయంత్రం 6 గంటల వరకు ఎగువన వున్న నాగార్జునసాగర్ నుంచి 4,47,664 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 74.02(పూర్తిస్థాయి 75.50) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.0957(పూర్తిస్థాయి 7.080 టీఎంసీలు)టీఎంసీలకు సమానం.టీఆర్‌సీ(టేల్ రేస్ ఛానల్) లెవల్ 64.01గా వుందన్నారు.విద్యుదుత్పత్తి పూర్తిగా నిలిపి వేశామన్నారు.అయితే ఈ నెల రోజుల వ్యవధిలో 23.2856 ఎంయుల(మిలియన్ యూనిట్లు) విద్యుత్‌ను ఉత్పత్తి చేశామన్నారు.


19 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



పులిచింతలకు వస్తున్న భారీ వరద

అచ్చంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. బుధవారం నాలుగు లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు కృష్ణా నదికి వస్తుండటంతో నదీతీర గ్రామాలను మండల తహసీల్దార్ కే శ్రీనివాసరావు బుధవారం అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టులో 32.25 టీఎంసీల నీటి నిల్వ ఉండగా ఎగువ నుంచి 4,27,580 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద 15 గేట్లను 4.5 మీటర్ల మేరకు ఎత్తి 4,63,165 క్యూసెక్కుల నీరు, పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,80,165 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే ఉపాధ్యాయులకు కనీసం పది సంవత్సరాలు సర్వీస్ ఉండాలని, ఎటువంటి క్రిమినల్, సివిల్ కేసుల నేరారోపణలు ఉండరాదని స్పష్టం చేశారు. ఆరోపణలు లేనట్లు ప్రత్యేకంగా ధృవీకరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయాలు, ఉర్దూ ఉపాధ్యాయులు ఉర్దూ రేంజి కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

గుంటూరు మీదగా సంత్రగచి, యశ్వంత్‌పూర్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సంత్రగచి, యశ్వంత్‌పూర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 02863 సంత్రగచి - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు సెప్టెంబరు 4, 11, 18(గురువారం) మధ్యాహ్నం 12.50కి బయలుదేరి శుక్రవారం సాయంత్రం 8.25కి గుంటూరు, 9.06కి నరసరావుపేట, అర్ధరాత్రి దాటాక (శనివారం) 12.55కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు. 02864 యశ్వంత్‌పూర్ - సంత్రగచి స్పెషల్ సెప్టెంబరు 6, 13, 20 తేదీల్లో(శనివారం) వేకువజామున 4.30కి బయలుదేరి సాయంత్రం 3.29కి నరసరావుపేట, 5.25కి గుంటూరు, ఆదివారం మధ్యాహ్నం 1.25కి సంత్రగచి చేరుకొంటుందన్నారు.

ఎన్నికల్లో పోటీ చేయని రెండు పార్టీలకు కలెక్టర్ షోకాజ్ నోటీసు

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 2019 నుంచి వరుసగా ఆరు సంవత్సరాల పాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయని రెండు రాజకీయ పార్టీలకు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మంగళగిరి దేవస్థానం రోడ్డు చిరునామాతో గ్రేట్ ఇండియా పార్టీ, కొల్లిపర మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో వెనకబడిన వర్గాల మహిళ రైతు పార్టీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ఈ రెండు పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయని కారణంగా కలెక్టర్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీ లోపు అన్నిరకాల ఆధార పత్రాలతో రాత పూర్వకంగా వివరణ లేఖని సచివాలయంలోని ఎన్నికల సంఘం సీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అలానే సెప్టెంబరు 8వ తేదీన వ్యక్తిగతంగా తన ఎదుట కలెక్టరేట్‌లో హాజరు కావాలని ఆదేశించారు.

సూర్యలంకకు.. అదనపు సొబగులు

- సెప్టెంబరు 27న సూర్యలంక రానున్న ముఖ్యమంత్రి
- రూ.97.52 కోట్ల పనులకు శంకుస్థాపన




హరితా బీచ్‌రిసార్ట్స్ కాటేజీలు


చేపల వేట చేస్తున్న మత్స్యకారులు

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరానికి అదనపు సొబగులు ఒనగూరనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక కేంద్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్రరాజధాని అమరావతికి అతిసమీపంలో ఉమ్మడి గుంటూరుజిల్లాలో ఉన్న సూర్యలంకసముద్రతీరంలో పర్యాటక ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయించారు. బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు గదులు కొరతను దృష్టిలో పెట్టుకొని అత్యాధునిక హంగులతో రిసార్ట్‌లు ఇతర మౌలికవసతులు కల్పించేందుకు సిద్ధమయ్యారు. స్టార్‌హోటళ్ళు కూడా రానున్నాయి. కొత్తగా 50 గదులు, సందర్శకులు బస చేసే సౌకర్యం కూడా ఏర్పాటు కానుంది. దీనివల్ల పర్యాటకశాఖకు కూడా పెద్దఎత్తున ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ద్వారా స్వదేశీ సందర్శన్-2 ప్రాజెక్ట్ కింద 97.52 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. బీచ్ అభివృద్ధి పనులకు టెండర్‌లు ప్రక్రియ కూడా జరుగుతున్నది. సెప్టెంబర్ 26,27,28 తేదిలలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు ఇక్కడ నిర్వహించ తలపెట్టారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ జె.వెంకటమురళి సమీక్షించారు. సెప్టెంబరు 27వ తేదిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూర్యలంక సముద్రతీరానికి వచ్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో చర్చించారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి: కమిషనర్

చిలకలూరిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు బుధవారం తెలిపారు. ఇందుకోసం సెప్టెంబరు 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు రెగ్యులరైజ్ చేయబడిన లేఅవుట్లలో మాత్రమే ప్లాట్లను కొనుగోలుచేయాలని, అనధికారిక లేఅవుట్లలో కొని నష్టపోకూడదని విజ్ఞప్తి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు త్వరగా ఈ పథకం కింద తమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఆయన సూచించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అన్నదాత సుఖీభవ నగదు జమ కాని వారు రెవెన్యూ అధికారులను సంప్రదించాలి

● తహసీల్దార్ రమేష్ కుమార్

నూజెండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు జమ కాని వారు ఆధార్ కార్డు తీసుకొని గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి వారి వద్ద ఉన్న లబ్ధిదారుల జాబితాను పరిశీలించుకోవాలని తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనులను విస్తృతంగా నిర్వహించాలి: ఎంపీడీవో

నూజెండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేయించాలని, ఎంపీడీవో పీ ఉమాదేవి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పండ్ల మొక్కలు నాటించటం, సేద్యపు నీటి కుంటలు, అమృత సరోవర్, రెవెన్యూ ప్లాంటేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

రేపు ఉపకరణాలందించేందుకు పరీక్షలు

వినుకొండ టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ఆర్టీసీ డిపో వద్ద గల జీవాలయంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి జప్రుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం ఎంఈవో జప్రుల్లా 8106454881, 9441691685 నంబర్లను సంప్రదించాలన్నారు.

అక్షర ఆంధ్రపై అవగాహన

వినుకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందికి అక్షర ఆంధ్ర (ఉల్లాస్ -2) లిటరసీ ప్రోగ్రామ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వయోజన విద్య సూపర్‌వైజర్ కె.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయ ఏవో రవికుమార్, ఏపీవో పద్మజ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో సమాజ సేవకులకు సన్మానం

చిలకలూరిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కుసుమ హరినాథ మందిరంలో సమాజ సేవకులైన సీనియర్ నర్సు ఇమ్మడి నాగరాజ్యం, పారిశుధ్య కార్మికురాలు ఆదమ్మ, మహిళా పోలీస్ స్వాతి, జనసేన నాయకురాలు పెద్దింటి సుమలతకు ఘనంగా సన్మానం చేశారు. జనసేన పార్టీ నాయకుడు అచ్చుకోల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మెగా రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా నరసరావుపేట చిరంజీవి యువత అధ్యక్షుడు అద్దెపల్లి ఆనంద్ బాబు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. అరండల్‌పేటలోని విజయబ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాని శిబిరాన్ని రోటరీ క్లబ్ ఆంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ రాయల శ్రీనివాసరావు ప్రారంభించారు. చిరంజీవి అభిమానులు 40 మంది రక్తదానం చేశారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 32 వ వార్డు మార్కండేయనగర్ రాములవారి వీధిలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న నూతన డ్రైన్ నిర్మాణం పనులకు బుధవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని శంకుస్థాపన చేశారు.

● యడ్లపాడు: యడ్లపాడు మండలం బోయపాలెం అనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో గురువారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మిల్లు ఎండీ, సామినేని ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల రెండు రోజుల పాటు ఈ శిబిరం ఉంటుందన్నారు.

● నాదెండ్ల: రైతులు సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా ఈ క్రాపు నమోదు చేయించుకోవాలని ఏవో శ్రీలత అన్నారు. మండలంలోని గొరిజవోలులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, ఏ రామారావు తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఏఎం రెడ్డి విద్యాసంస్థలలో ఏఎంరెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్, ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సహకారంతో లాంచ్‌పాడ్ టూ ఇన్నోవేషన్ ఓరియెంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ఏసీఐసీ కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీ రమాకాంత్ పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: జేఎన్‌టీయూ నరసరావుపేట క్యాంపస్‌లో బుధవారం నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్-హబ్ వర్చువల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల నుంచి 1256 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కిసాన్ మేళా స్టాల్స్

● ఉపయోగకరమంటూ రైతుల హర్షం



మెగా కిసాన్‌మేళా సందర్భంగా మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన స్టాల్స్

వినుకొండ టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో 2వ రోజు మెగా కిసాన్‌మేళా నిర్వహించారు. ఈ కిసాన్‌మేళాలో రాష్ట్రంలో పేరుగాంచిన వివిధ కంపెనీల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల స్టాల్స్‌ను రైతు సోదరులు సందర్శించారు. ఈ స్టాల్స్‌లో నూతన వంగడాలు, పురుగు మందులు, సూక్ష్మపోషకాలు ప్యాకెట్లను రైతులకు అధికారులు వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల సంపాదించేలా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ స్టాల్స్ వల్ల కొత్త విషయాలు తెలుసుకున్నామని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులకు ఉద్యాన పంటలతో పాటు షేడ్ నెట్, డ్రిప్, ఆయిల్ పామ్‌లో అంతర పంటగా అరటి, మామిడి, టమోట, డ్రాగన్ పండ్ల తోటలలో బంతి, శాశ్వత దొండ పందిరిలతో పాటు రాయితీపై ట్రాక్టర్లు, ఇలా అన్ని నమూనాలు ఒకే చోట ఏర్పాటు చేయడంతో విశేషంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గిర్, పుంగనూర్, ఒంగోలు ఆవులతో పాటు కోళ్లు, పశు దాణా, వివిధ రకాల గడ్డి విత్తనాలను అధికారులు ప్రదర్శనగా ఉంచారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగు, ఏపీఎంఐపీ, డ్రిప్, స్ప్రింకర్లు సహకార శాఖ పీఎం సూర్యఘర్ సౌర ఫలకాలు, వివిధ కంపెనీ ట్రాక్టర్లు, డ్రోన్‌లు, సేద్యపు పరికరాలను స్టాల్స్‌లో ప్రదర్శనగా ఉంచారు. అదేవిధంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని అధికారుల సూచనలు సలహాల మేరకు వ్యవసాయంలోని మెళకువల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకట్రావు, వినుకొండ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, వినుకొండ ఏవో వరలక్ష్మితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎరువులు, పురుగుమందుల అసోసియేషన్ నాయకులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులను అభివృద్ధి చేయండి

నరసరావుపేట, రొంపిచర్ల

మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే చదలవాడ వినతి



మంత్రి అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, పూనాటి శ్రీనివాసరావు, ఎం. రామారావు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట, రొంపిచర్ల మార్కెట్ యార్డులను అభివృద్ధి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును ఆయన స్వగృహంలో బుధవారం నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, నూతనంగా నియమితులైన నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్ పునాటి శ్రీనివాసరావు, రొంపిచర్ల మాజీ ఎంపీపీ మొండితోక రామారావులు కలిశారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు అందజేశారు. నరసరావుపేట మార్కెట్ యార్డు కోసం రూ.3.80కోట్లతో ప్రతిపాదనలు సమర్పించగా ఇందులో చైర్మన్ కార్యాలయ భవన నిర్మాణం, గోడౌన్లు మరమ్మతులు ఉన్నాయి. రొంపచర్ల మార్కెట్ యార్డు కోసం రూ. 2కోట్లతో ప్రతిపాదనలు అందించారు. ఇందులో పశువుల సంత ఏర్పాటు, ప్లాట్‌ఫారమ్ నిర్మాణం, ప్రహరీ గోడ నిర్మాణం ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు నియోజకవర్గానికి నిధులు ఇచ్చి సహకరించాలని మంత్రి అచ్చెన్న నాయుడును కోరారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధి పనులకోసం త్వరలో నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై డీజీపీకి ఫిర్యాదు

కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు డీజీపీకి ఫిర్యాదు చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తాను మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని కోరారు. ఆయా సమస్యలపై తక్షణచర్యలు తీసుకుంటామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ దేశంలో శాంతిభద్రల విషయంలో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025లో రాష్ట్రం 6.32/10 స్కోర్‌తో పెద్ద రాష్ట్రాలలో రెండో స్థానం సాధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విజయం రాష్ట్రంలో చట్టం, శాంతి భద్రతలను పటిష్టం చేయడంలో ప్రభుత్వం, పోలీసు శాఖ చేస్తున్న కృషిని ప్రతిబింబిస్తుందన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ హనుమకుమార్

నరసరావుపేట లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంవో రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ, మెదడువాపు వ్యాధులు వ్యాపిస్తాయన్నారు ప్రజలందరూ బాధ్యతగా ప్రతి శుక్రవారం డ్రైడేగా భావించి తమ ఇంటి పరిసరాల్లోనే నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. ఇంటిలోపల కూలర్లు ఫ్రిజ్‌లో ఉండే వేస్ట్ వాటర్‌లో కూడా గమనించి శుక్రవారం నిలువ ఉన్న నీటిని తొలగించాలన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ హనుమకుమార్ జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

● వినుకొండ: పట్టణంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, హనుమాన్ నగర్ సబ్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం 'మస్కిటో డే ర్యాలీ' నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఎస్‌వీ సుబ్బారావు, కే.రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ పి.బాలస్వామి పాల్గొని దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

● నాదెండ్ల: దోమల పట్ల నిర్లక్ష్యగా ఉండ రాదని నాదెండ్ల వైద్యాధికారి డాక్టర్ సాయి శ్వేత అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పీ కమల, సబ్ యూనిట్ అధికారి నారాయణ, ఆరోగ్య సిబ్బంది అగ్నేసమ్మ, పీ శ్రీను, భవానీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల పరిషత్ సమావేశం

● సమస్యలపై ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి కరువు

● 15 సర్పంచ్‌లకు 5, 11మంది ఎంపీటీసీలకు ఐదుగురు హాజరు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తుంటే ప్రజాప్రతినిధులు మాత్రం సమావేశాలకు హాజరు కాకుండా ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో మండల పరిషత్ సమావేశం మొక్కుబడిగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. 15మంది సర్పంచ్‌లకు ఐదుగురు, 11మంది ఎంపీటీసీలకు ఐదుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. పోలీస్, హార్టీకల్చర్, ఎన్నెస్పీ, అటవీ శాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. వేల్పూరు-1 ఎంపీటీసీ లింగా పున్నమ్మ వేల్పూరులో పచ్చిరొట్ట విత్తనాలు సక్రమంగా పంపిణీ చేయలేదని, డీఏపీ కట్టలు ఒక్కొక్కరికి ఐదు మాత్రమే ఇస్తున్నారని ఏవో దృష్టికి తేగా రైతులు విడతలవారీగా ఎరువులు తీసుకోవాలన్నారు. వేల్పూరు జడ్పీ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంఈవో దృష్టికి తెచ్చారు. వేల్పూరుకు పంచాయతీ కార్యదర్శిని నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, గతంలో పని చేసిన కార్యదర్శి రికార్డులు అప్పగించలేదని ఎంపీడీవోకి ఫిర్యాదుచేశారు. ప్రభుత్వాలు మారినా వేల్పూరు-వెలమావారిపాలెం రహదారికి మాత్రం మోక్షం కలుగలేదని, తాగునీటిని శుద్ధి చేయకుండా మురికినీటిని వదులుతున్నారన్నారు. చిన్నకంచెర్ల ప్రాథమికోన్నత పాఠశాల్లో 3 నుంచి 8వ తరగతి వరకు ఇద్దరే టీచర్లు ఉన్నారని సర్పంచ్ పూరేటి నాగేశ్వరరావు తెలిపారు. స్వర్ణపంచాయతీల్లో భాగంగా గ్రామాల్లో అన్ని ఇళ్ళను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ఇంటిపన్నులను యజమానులు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, వినుకొండ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి, నంబూరి ప్రభావతి పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ కృషి చిరస్మరణీయం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ కృషి చిరస్మరణీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. బుధవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ దేశం నూతన సాంకేతికత వైపు అడుగులు వేసేలా రాజీవ్ కృషి చేశారన్నారు. దేశం కోసం ఉగ్రవాదుల బాంబు దాడిలో అశువులు బాశారన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సీదా కృష్ణరావు, మొలత్రాతి ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇమ్మాన్యేల్, బీసీ సెల్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, ప్రసాదు, పాస్టర్ల సంఘం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ శ్యామ్ పెట్రోడా అనే శాస్త్ర సాంకేతిక రంగ నిపుణుడిని ఇటలీ నుంచి రప్పించి దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రవేశపెట్టడం ద్వారా యువత భవిష్యత్తుకు పునాదులు వేశారన్నారు. కార్యక్రమంలో హాజీ షేక్ సలాం,షేక్ నసురుద్దీన్, యరగళ్ళ రవి, ఎప్పాల అంజిరెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్ పాల్గొన్నారు.

గులాబి పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

● వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు

యడ్లపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగించే గులాబి పురుగు నివారణకు పంట తొలిదశ నుంచే చర్యలు తీసుకోవాలని నరసరావుపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మైదవోలు, యడ్లపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లోని పత్తి పంటను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబి పురుగును సమర్థవంతంగా నిరోధించేందుకు తొలిదశలో వేప నూనె, వేప గింజల కషాయం చల్లుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు వీఆర్వోను సంప్రదించి తీసుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులు రైతు సేవా కేంద్రాల సహాయకులను సంప్రదించి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట విక్రయాలకు, ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందేందుకు ఈ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఏఈవో జీవన్‌నాయక్, వ్యవసాయ సహాయకులు గోపి, బిలాల్, అనుపమ, రైతులు పాల్గొన్నారు.

అరెస్టులు 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'ను ఆపలేవు

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమాన్ని ఆపాలని కుట్రిపూరితంగా మా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేస్తున్నారని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టినరోజు కేక్ కట్ చేశామని ట్రాఫిక్‌కు 10 నిమిషాలు అంతరాయం కలిగించామన్న కారణంతో అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. ఈ నెల 19న టీడీపీ ర్యాలీ సందర్భంగా మూడు గంటల పాటు పట్టణంలో ట్రాఫిక్‌ను నిలవరించటం ఇది అన్యాయం కాదా అని ప్రశ్నించారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలి

● ఎస్ఐ బీవీ కృష్ణారావు

నూజెండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ మండపాలు ఏర్పాటుచేసి ఉత్సవాలు చేసే వారు కమిటీగా ఏర్పాటై పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ బీవీ కృష్ణారావు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డు డ్యాన్స్‌లు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. రహదారులపై, ట్రాఫిక్ కూడళ్లల్లో రహదారులను ఆక్రమించ రాదని, అధిక శబ్దం చేసే డీజేసౌండ్‌లు, లౌడ్ స్పీకర్లు వాడరాదని, శోభాయాత్రలో మద్యం సేవించి అసభ్య ప్రవర్తన చేయరాదని సూచనలు చేశారు.

పొగాకు సాగును ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పొగాకు సాగును నిషేధించామని, ఎవరైనా పొగాకు సాగును ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పీ అరుణ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను 3124మంది రైతులు 10,954 ఎకరాలలో బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగు చేయగా 1,21,010 క్వింటాలు దిగుబడి వచ్చిందన్నారు. అధిక దిగుబడి వల్ల పొగాకు వ్యాపారులు రైతుల నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేదని దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఏ రకమైన పొగాకును సాగు చేయవద్దని పూర్తి బాధ్యతను గ్రామ, మండల స్థాయిలో వుండే వ్యవసాయ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. పొగాకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్నిచ్చే ఇతర పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. రైతు సోదరులు మాయ మాటలు నమ్మి మోసపోరాదని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

విష ప్రచారంలో మునిగితేలుతున్న జగన్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి విమర్శ

చిలకలూరిపేట, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): పూటకో కట్టుకథ, రోజుకో తప్పుడు కథనం దినచర్యగా పెట్టుకుని ప్రభుత్వంపై విషప్రచారంలో జగన్ మునిగి తేలుతున్నాడని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలు మర్చిపోలేని విధంగా బుద్ధిచెప్పినా జగన్ వైఖరిలో మార్పు రాలేదన్నారు. చంద్రబాబు పాలనతో జగన్, వైసీపీనేతలు నిత్యక్షోభతో అల్లాడిపోతున్నారని వివరించారు. తమలోని అక్కసు, అసూయ, అహంకారాన్ని బహిరంగపరిచే క్రమంలో ప్రభుత్వాన్ని, చంద్రబాబుని ఎలా బదనాం చేయాలన్న ఆలోచనలతో వారిలో వారే రగిలిపోతున్నారని పేర్కొన్నారు. పేటీఎం బ్యాచ్‌తో సోషల్ మీడియాలో అమరావతి మునిగిందని, పోలవరం పనుల్లో నాణ్యత లేదని, రాజధాని నిర్మాణంలో అవినీతని, హామీలు అమలుకాలేదని, మహిళలకు బస్సులు లేవని పనిగట్టుకొని చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను ఆయన ఖండించారు. వైసీపీ వారు తమ ఆలోచనా విధానం మార్చుకోకుంటే ప్రజలు ఈసారి ఏకంగా డెత్‌బెల్ మోగిస్తారని హెచ్చరించారు.

జిల్లా సాఫ్ట్ బాల్ జట్టుకు రొంపిచర్ల విద్యార్థినుల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన రొంపిచర్ల జడ్పీ పాఠశాల విద్యార్థినులు

రొంపిచర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సుభానీ బుధవారం తెలిపారు. సత్తెనపల్లి పరిధిలోని కొమెరపూడి జడ్పీ పాఠశాలలో శ్రీదేవి, శ్రీలక్ష్మి, చంద్రిక ఎంపికయ్యారు. జిల్లా జట్టు తరుపున త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో వీరు ఆడతారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీటి కోసం చేతిపంపు ఏర్పాటు

కనమర్లపూడి (శావల్యాపురం) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమర్లపూడి బీసీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మండల పరిషత్ నిధులు రూ.1.20లక్షలతో చేతిపంపును ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య బుధవారం తెలిపారు. బీసీ కాలనీలో చేస్తున్న చేతిపంపు నిర్మాణాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా బీసీ కాలనీలో చేతిపంపు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటప్రకారం చేతిపంపు ఏర్పాటు చేశామని, త్వరలో వాడుకలోకి తెచ్చి బీసీ కాలనీలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. టీడీపీ నాయకులు ముక్కపాటి నాగేశ్వరరావు, కాసరగడ్డ వెంకటరత్నం, బోడెపూడి వెంకటేశ్వర్లు, యలవర్తి వీరయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన కల్పించాలి

● డివిజనల్ పంచాయతీ అధికారి వీవీఏ లక్ష్మణరావు



రెడ్డిపాలెంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణరావు

బొల్లాపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి వీవీఏ లక్ష్మణరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రెడ్డిపాలెంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణలో రెడ్డిపాలెం గ్రామం వెనుకంజలో ఉందని, చెత్త సేకరణపై శ్రద్ధ చూపాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఐవీఆర్‌ఎస్ ప్రజా స్పందన సర్వేలో 70 నుంచి 30శాతం వరకు వచ్చిందన్నారు. చెత్త సేకరణపై గ్రామంలో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకం తొలగింపుతో పత్తి రైతులకు నష్టం: డాక్టర్ కొల్లా

చిలకలూరిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే పత్తి మీద అన్ని సుంకాలను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు బుధవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చిలకలూరిపేటలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వల్ల పత్తి ధర ఖచ్చితంగా తగ్గుతుందన్నారు. రైతులు, ప్రజాస్వామిక వాదులందరూ ప్రభుత్వ నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకించాలని కోరారు. ఏ పంటలు వేస్తే రైతులకు, ప్రజలకు, సమాజానికి ఉపయోగమో ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, లక్షలాదిమంది పత్తి రైతులకు మేలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జేవీవీ ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథ దినోత్సవం

చిలకలూరిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు మాట్లాడుతూ మూఢ విశ్వాసాల నిరోధం కోసం ఉద్యమం చేపట్టిన పద్మశ్రీ డా నరేంద్ర అచ్యుత్ దోబోల్కర్ వర్థంతిని జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. కార్యదర్శి అజయ్ బాబు మాట్లాడుతూ దోబోల్కర్‌ను సైన్స్ వ్యతిరేకులు కాల్చి చంపారన్నారు. మరణానంతరం కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించిందన్నారు. తొలుత విద్యార్థులకు జేవీవీ ప్రచురించిన శాస్త్రీయ దృక్పథం పుస్తకాలను బహుమతిగా అందచేశారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించి బహుమతి ప్రదానం చేసారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డి.బుజ్జిబాబు, విన్సెంట్ పాల్, దాదా లాలూ సాహెబ్, సేవాసమితి అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా, పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్‌రావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు

నూజెండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన వినుకొండ పట్టణంలోని ఆర్‌సీఎం స్కూల్‌లో నియోజక వర్గ స్థాయి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈవో సత్యనారాయణ బుధవారం తెలిపారు. 18సంవత్సరాల లోపు వయస్సు ఉన్న విద్యార్థులు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.